

అనంతపురం నగరంలోని ఆపిల్ ఫంక్షన్ హాల్ ఎదుట సిమెంటు రోడ్డు దుస్థితి ఇది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుమార్లు ఇక్కడ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. అయినా ఈ రోడ్డును బాగుచేయించాలన్న ఆలోచన చేయలేదు. టెండరు పిలిచి.. అగ్రిమెంట్ పూర్తి అయినా.. కాంట్రాక్టర్ ఈ పనులను ప్రారంభించలేదు. మంత్రి ఆలోచన చేసుంటే.. రోడ్డు ఎప్పుడో బాగుపడేది.

ఉష్ణోగ్రతలు (మంగళ)

గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 24.0

నగర పరిధిలో రూ.35 కోట్ల పనులకు బ్రేక్

అధ్వానంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ

టెండర్లు దక్కించుకుని.. పనులు చేయని కాంట్రాక్టర్లు

బిల్లులు కావన్న అనుమానమే ప్రధాన కారణం


బిల్లు భయం..!



మురుగునీటి కాలువ నిర్మించకపోవడంతో నీరు-ప్రగతి పార్కు వద్ద ఇదీ పరిస్థితి

అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్లను 'బిల్లు' భయపెడుతోంది. ప్రభుత్వ పనులంటే గతంలో ఎగబడే కాంట్రాక్టర్లు.. గత ఐదేళ్లుగా వాటిని చూస్తే ఆమడ దూరం పరిగెడుతున్నారు. చాలామంది పనులను దక్కించుకుని.. ప్రారంభించడానికి వెనుకంజ వేశారు. చేయాల్సిన పనులను పక్కన పెట్టారు. నగర పాలిక పరిధిలో పనులకు అధికారులు టెండర్ పిలవడం, కాంట్రాక్టర్లు వాటిని దక్కించుకుని, అగ్రిమెంట్ కుదుర్చుకోవడం పూర్తి అయింది. కానీ పనులు చేపట్టలేదు. ఇలాంటి పనులు రూ.కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. గడిచిన రెండేళ్లలో రూ.35 కోట్లకు పైగా పనులు ప్రారంభానికి సైతం నోచుకోలేదు. 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, ప్రత్యేక నిధులకు సంబంధించిన పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల తరువాత పరిస్థితి ఎలా ఉంటుందోనని కాంట్రాక్టర్లు పనులవైపు కన్నెత్తి చూడలేదు. దీంతో నేటికీ పలు కాలనీల్లో రహదారులు, మురుగునీటి కాలువను అధ్వానంగా మారాయి.

- అనంతపురం క్రైం





ఆదర్శ నగర్‌కు వెళ్లే రోడ్డు

రూ.8 కోట్ల పనులకు బ్రేక్

నగర పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.8 కోట్ల పనులకు టెండర్ పిలిచారు. అన్ని ప్రక్రియలు ముగిసినా పనులు ప్రారంభం కాలేదు. 20వ డివిజన్ పరిధిలో సీసీ డ్రెయిన్ రూ.12 లక్షలకు, 22వ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ నగర్, మరువకొమ్మ కాలనీ, బుడ్డప్పనగర్‌లో సీసీ డ్రెయిన్‌కు రూ.16 లక్షలతో టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. 35వ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ 80 అడుగుల రోడ్డులో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం కోసం రూ.35 లక్షలతో టెండరు పిలిచారు. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ ఆ పనులు చేపట్టలేదు. సీసీ డ్రెయిన్ నిర్మాణాలకు ఎంజీ కాలనీలో రూ.14.30 లక్షలు, వేణుగోపాల్ నగర్‌లో రూ.8.50 లక్షలు, దళితవాడలో రూ.12లక్షలు, నాయక్ నగర్‌లో రూ.10.40లక్షలు, 80 అడుగుల రోడ్డు నీరుప్రగతి పార్కు సమీపంలో రూ.15.80 లక్షలు, బిందెల కాలనీలో రూ.34.11 లక్షలతో టెండర్లు పిలిచారు. వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టాలేదు. రామ్‌నగర్‌లో సీసీ డ్రెయిన్ కోసం రూ.64.53 లక్షలతో టెండర్ దక్కించుకున్నారేగాని, పనును ప్రారంభించలేదు. భవానీ నగర్‌లో రూ.15లక్షలు, హమాలీ కాలనీలో రూ.14.70 లక్షల పనులదీ అదే పరిస్థితి. ఇలా మొత్తం మొత్తం రూ.8 కోట్ల వరకు పనులు అటకెక్కాయి.



శ్రీనగర్ కాలనీలో 80 అడుగుల రోడ్డు.. ఇంకా మట్టి రోడ్డే

జనరల్ ఫండ్‌లో..

నగరంలో రూ.9 కోట్లతో చేపట్టిన జనరల్ ఫండ్ పనులకూ బ్రేక్ పడింది. సీసీ రోడ్లు, సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్‌లు, సీసీ డ్రెయిన్ పనులు ఇందులో ఎక్కువగా ఉన్నాయి. నగరంలోని మూడో డివిజన్ పరిధిలో సీసీ రోడ్డు విస్తరణ పనులకు రూ.26 లక్షలు, రూ.38 లక్షలతో వేర్వేరుగా టెండర్లు పిలిచారు. వాటిని ఒకే సంస్థ దక్కించుకుంది. కానీ పనులు చేపట్టలేదు. 11వ డివిజన్ పరిధిలోని కట్టకింద వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.18.50 లక్షలతో టెండరు పిలిచారు. ఆ పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ఆదిమూర్తి నగర్‌లో రూ.32.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్ పిలిచారు. అక్కడా కాంట్రాక్టరు ముందుకు రాలేదు. కోవూరునగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.38 లక్షలతో టెండరు పిలిచారు. పనులను దక్కించుకున్నారు. కానీ ప్రారంభించలేదు. రూ.4 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఉన్న పనుల టెండర్లు దక్కించుకుని, ఒప్పందం చేసుకున్నవారు చాలామందే ఉన్నారు. ఏ ఒక్కరూ పనులు చేయడం లేదు.

పెండింగ్ నిజమే..

నగర పరిధిలో చాలా పనులకు టెండర్, అగ్రిమెంట్ పూర్తయ్యాయి. కానీ పనులు ప్రారంభం కాలేదు. దీనికి ప్రధాన కారణం, కొందరు కాంట్రాక్టర్లే ఎక్కువ పనులు దక్కించుకోవడం. బిల్లులు సైతం రావాల్సి ఉంది. ఈ క్రమంలోనే పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి.

- సూర్యనారాయణ, నగరపాలిక ఈఈ

రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్..

అనంతపురం కార్పొరేషన్‌కు స్పెషల్ గ్రాంట్ కింద రూ.25 కోట్లు కేటాయించారు. ఆ పనుల్లోనూ 75 శాతం పెండింగ్‌లో ఉండిపోయాయి. భాగ్యనగర్, బిందెల కాలనీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలకు రూ.1.96 కోట్లతో టెండర్ పిలిచారు. అగ్రిమెంట్ కుదిరినా పనులు ముందుకు సాగలేదు. వేణుగోపాల్ నగర్, భవానీ నగర్‌తో పాటు పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణానికి వేర్వేరుగా రూ.1.62 కోట్లతో రెండు టెండర్లు పిలిచారు. కానీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రెండో రోడ్డు పరిధిలో బీటీ రోడ్డు విస్తరణకు రూ.1.69 కోట్లు, నడిమివంకలో మేజర్ బ్రిడ్జి, మేజర్ డ్రెయిన్ నిర్మాణాలకు రూ.1.87 కోట్లతో పిలిచిన టెండర్‌ది సైతం అదే పరిస్థితి. రూ.25 కోట్ల నిధులకు గాను రూ.17 కోట్లకు పైగా పనులు ప్రారంభం కాలేదు.

వెంటాడిన ప్రమాదాలు

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి బెంగళూరులో మృతి

మృతదేహాన్ని తెస్తూ.. బస్సును ఢీకొన్న అంబులెన్సు

అందులో ఉన్న ఇద్దరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు



షంషావలి, షకీల, మహమ్మద్ గౌస్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి/తాడిపత్రి టౌన్, మార్చి 19: ఎన్ఎస్ గేటు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు, తాడిపత్రి పట్టణానికి చెందిన షంషావలి(70) రోడ్డు ప్రమాదంలో గాయపడి, బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకుని తాడిపత్రికి బయలుదేరారు. ఎన్ఎస్ గేటు సమీపంలో ముందు వెళుతున్న తాడిపత్రి డిపో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి అంబులెన్స్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షంషావలి అల్లుడు గౌస్ మహమ్మద్(35) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన షంషావలి భార్య షకీలా(62), కుమారుడు హాజీవలి, కూతురు రిజ్వాన, అంబులెన్స్ డ్రైవర్ సురేశ్‌ను 108 అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షకీలా మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్ పరిస్థితి ఆందోళనంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. ప్రమాదం గురించి తెలియగానే ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సు వెనుక భాగంలో ఇరుక్కుపోయిన అంబులెన్స్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీయించి, క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అంబులెన్స్ అతి వేగమే ప్రమాదానికి కారణని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వెంటాడిన ప్రమాదాలు

తాడిపత్రిలోని పీర్ల మాన్యం కాలనీకిచెందిన షంషావలి కుటుంబాన్ని రోడ్డు ప్రమాదాలు వెంటాడాయి. సైకిల్‌పై వెళుతున్న షంషావలిని 20 రోజుల క్రితం బైకు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన.. బెంగళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు షెక్షావలి మృతదేహాన్ని తాడిపత్రికి తీసుకు వస్తూ ప్రమాదానికి గురయ్యారు. షెక్షావలి, ఆయన భార్య షకీలా, అల్లుడు గౌస్ మహమ్మద్‌ను ప్రమాదాలు బలిగొన్నాయి. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. షెక్షావలి కుమారుడు, కూతురు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.




నుజ్జునుజ్జైన అంబులెన్స్ ముందుభాగం

పెను విషాదం

షంషావలి, షకీలా దంపతులకు ముగ్గురు కూతుళ్లు రిజ్వానా, సోఫియా, బల్‌కిసా, ఒక కుమారుడు హాజీవలి ఉన్నారు. హాజీవలి అవివాహితుడు. ముగ్గురు కూతుళ్లకు వివాహాలు జరిగాయి. మృతిచెందిన రెండో అల్లుడు మహమ్మద్ గౌస్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్య సోఫియా, ఓ కుమారుడు ఉన్నారు. షంషావలి పట్టణంలో సమోసాలు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. షకీలా కూలి పనులకు వెళ్లేవారు. హాజీవలి ఆటో నడుపుతూ తల్లిదండ్రులకు సహకారం అందించేవాడు. సాఫీగా సాగిపోతున్న శ్రమజీవుల కుటుంబంలో ప్రమాదాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. షంషావలికి మంగళవారం ఉదయం బంధువులు అంత్యక్రియలను నిర్వహించారు. సాయంత్రానికి షకీల, గౌస్ మృతదేహాలను తాడిపత్రికి తీసుకువచ్చారు. ఆ కుటుంబం పరిస్థితి చూసి కాలనీవాసులు కంటతడి పెట్టుకున్నారు.



మహమ్మద్ గౌస్ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య సోఫియా



ఇఫ్తార్	: బుధవారం సాయంత్రం	06:32
సెహరీ	: గురువారం ఉదయం	05:07

ఎన్నికల బాధలో..!

విధుల మినహాయింపు కోరిన ఉద్యోగులు

వెరిఫికేషన్‌కు వచ్చిన వందలాది మంది



ఈ ఫొటోలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు ఉరవకొండ, బుక్కరాయసముద్రం మండలాల్లో పనిచేస్తున్నారు. ఇద్దరూ దివ్యాంగులు. ఇలాంటి వారికి ఎన్నికల విధులు కేటాయించకూడదు. కానీ, కేటాయించారు. తాము విధులు నిర్వర్తించలేమని ఉన్నతాధికారులకు విన్నవిస్తే.. తరువాత వచ్చి కలవాలని సూచించారు. దీంతో వారు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు



కుందుర్పి మండలంలో పని చేస్తున్న ఈ ఉద్యోగి.. రెండు నెలల క్రితం ప్రసవించారు. చంటి బిడ్డతో ఉన్న ఈమెకు ఎన్నికల విధులను కేటాయించారు. మినహాయించాలని కోరితే.. వెరిఫికేషన్‌కు రావాలని సూచించారు. దీంతో ఆమె చంటి బిడ్డతో రెవెన్యూ భవన్‌కు వచ్చారు. చెట్టుకు ఊయల వేసి, బిడ్డను పడుకోబెడుతూ కనిపించారు.

అనంతపురం టౌన్, మార్చి 19: అనారోగ్యం, ఇతర కారణాలతో ఎన్నికల విధులకు హాజరు కాలేనివారు మినహాయింపు కోరుతూ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేస్తారు. అందకు తగ్గ ధ్రువపత్రాలను సమర్పిస్తారు. వాటిని పరిశీలించి, అర్హత ఉంటే విధుల నుంచి మినహాయించవచ్చు. కానీ అధికారులు వారిని వెరిఫికేషన్‌కు నేరుగా రావాలని పిలిపిస్తున్నారు. దీంతో దివ్యాంగులు, బాలింతలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని చాలామంది చిన్ని చిన్నఅనారోగ్య సమస్యలను కూడా సాకుగా చూపుతున్నారు. దీంతో ఆయా శాఖల అధికారుల నుంచి జాబితా వచ్చినా, జిల్లా అధికారులు తేలిగ్గా అంగీకరించడం లేదు. మినహాయింపు కోరిన ఉద్యోగుల విషయంలో కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి కఠినంగా వ్యవహరిస్తున్నారు. వారి దరఖాస్తుల పరిశీలనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రెండు రోజులుగా రెవెన్యూ భవన్‌లో సర్టిఫికెట్లను వెరిఫై చేస్తోంది. దరఖాస్తు చేసినవారు స్వయంగా వచ్చి, వాటిని చూపించాల్సి వస్తోంది. వందల మంది ఉద్యోగులు రెవెన్యూ భవన్‌కు వస్తున్నారు. వైద్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు సర్టిఫికెట్లను పక్కాగా పరిశీలిస్తున్నారు. అర్హత ఉంటే మినహాయింపు ఇస్తున్నారు. లేదంటే విధులకు రావాల్సిందేనని చెప్పి పంపుతున్నారు. విషయం తెలుసుకుని, మినహాయింపు కోరిన పలువురు వెరిఫికేషన్‌కు రావడం లేదు. కానీ, నిజంగానే సమస్య ఉన్నవారు వెరిఫికేషన్‌కు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కట్టుదిట్టంగా కోడ్ అమలు చేయాలి

సి-విజిల్ యాప్‌పై అవగాహన కల్పించండి: కలెక్టరు



అనంతపురం టౌన్, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు గౌతమి ఆదేశించారు. సీ విజిల్ యాప్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఆ యాప్‌కు వచ్చే ఫిర్యాదులను గంటన్నర లోగా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుపై మంగళవారం పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టరు జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ సూచనలను పక్కాగా అమలు చేయాలన్నారు. కోడ్ నిబంధనల మేరకు రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు, ఫొటోలు వెంటనే తొలగించాలన్నారు. ఎక్కడ సమస్యలు... ఫిర్యాదులొచ్చినా కమిటీలు వెంటనే పరిష్కరించాలన్నారు. వలంటీర్లు రాజకీయ కార్యక్రమాలు, ప్రచారాల్లో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఓలకు కలెక్టరు ఆదేశించారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే విచారణ చేపట్టి రిపోర్టులను పంపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, జడ్పీ సీఈఓ, నగరపాలక కమిషనర్, ఆర్ఓలు పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికలే లక్ష్యం: ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 19: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమని ఎస్పీ అన్బురాజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు, మరణాయుధాలు జిల్లాలోకి రాకుండా కర్ణాటక సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులు, జిల్లా సరిహద్దులో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోకి వచ్చి వెళ్లే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు నాలుగు డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, పోలీసులు, సెబ్ సిబ్బంది అందులో ఉంటూ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా 45 బృందాలు తనిఖీలు చేస్తున్నాయని అన్నారు. వీటితో పాటు 24 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, 24 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి, గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర సాయుధ బలగాల కవాతు, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమస్యలు ఉంటే తన ఫోన్ నంబర్ 9440796800, లేదా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9392918293 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



రథోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి



అశేష జన సందోహం మధ్య ముందుకు సాగుతున్న రథం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు




ఉత్సవ మూర్తుల ఊరేగింపులో ఉత్తరాధికారి, ఏసీ

గవిమఠం.. జనసంద్రం

వైభవంగా చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన గవిమఠం ప్రాంతం

ఉరవకొండ, మార్చి19: పట్టణంలోని గవిమఠ స్థితచంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రథం అలంకరణ కోసం ప్రత్యేక పూలహారాలను తెప్పించారు. గజలక్ష్మి(ఏనుగు)తో పాటు, గ్రామపంచాయతీ నుంచి గవిమఠం వరకూ పూలహారాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ పూల అలంకరణతో రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రథాన్ని అశేష జనసంద్రం నడుమ గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ లాగారు. శివనామ స్మరణతో గవిమఠం ప్రాంతమంతా మార్మోగింది. రథంపైకి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. తిరిగి రథాన్ని యథాస్థితికి చేర్చారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా బళ్లారి, తుంకూరు తదితర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకీమఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, గవిమఠం సహాయకమిషనర్ చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

పట్టణంలోని గవి మఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వర స్వామిని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ దర్శించుకున్నారు. గవి మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అర్చకులు విరుపాక్షి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్ భాస్కర్, నూతేటి వెంకటేశులు, తిమ్మప్ప, రాంబాబు, వెంకటేశులు, కేశవానంద, గోవింద్ పాల్గొన్నారు.


సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయ ప్రాంగణం

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కదిరి, మార్చి 19: ఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు పట్టణంలోని ఆలయ ప్రాంగణంలోగల యాగశాలలో మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. పక్షం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఎటువంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తి అయ్యేలా చూడాలని అష్టదిక్పాలకులను వేడుకోవడం, ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించే క్రతువునే అంకురార్పణ అంటారు. తొలుత యాగశాలలో పుణ్యాహవచనం నిర్వహించి, శ్రీవారి ఆలయంలో స్వామివారి సర్వ సైన్యాధ్యక్షుడైన విశ్వక్సేనుడి ఉత్సవ విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ విగ్రహాన్ని మండపంలో ఆలయ మర్యాదలతో కొలువుదీర్చారు. తర్వాత ఈశాన్య దిక్కుకు వెళ్లి ఉత్సవాలకు ప్రారంభ సూచికగా విశ్వక్సేనుడి సమక్షంలో ప్రధానాచార్యులు భూమాత అనుగ్రహం కోసం భూమికి విశేషమైన ఆరాధన చేశారు. భక్తిశ్రద్ధలతో మంత్రయుక్తంగా మట్టిని సేకరించి యాగశాలకు చేరుకున్నారు. ప్రధానాచార్యులు బ్రహ్మస్థానంలో ఉండి విశేష ఆరాధనలు చేశారు. తర్వాత యాగశాలలో నిత్యాగ్ని హోత్రాన్ని వెలిగించారు. ఉత్సవాలు ముగిసే వరకు ఈ అగ్నిహోత్రం వెలుగుతూనే ఉంటుంది. కల్యాణోత్సవం నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు శ్రీవారు యాగశాలలోనే కొలువుదీరుతారు. పుట్టమన్ను సేకరించి యాగశాలలో నవధాన్యాలను మొలక పోస్తారు. ఇందులో మొలక ఏ దిక్కున ఎక్కువగా వస్తుందో ఆ దిక్కున పంటలు ఎక్కువగా పండుతాయని భక్తుల నమ్మకం. మొదటిరోజు కార్యక్రమం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేడు నృసింహుడి కల్యాణోత్సవం..

బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న లక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం ఆలయ ప్రాంగణంలో కన్నుల పండువగా జరగనుంది. అంతకు ముందు ఉదయమే ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఉత్సవాలకు అధిపతి అయిన గరుడాళ్వార్‌ను ధ్వజారోహణం గావించడమే ఈ వేడుక ప్రాముఖ్యత. నేడు ఆరోహణం గావించిన గరుడాళ్వార్‌ను ఉత్సవాలు ముగిసే వరకు అలాగే ఉంచి, తీర్థవాది రోజున అవరోహణం గావిస్తారు. ఈ వేడుకను తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. తొలుత యాగశాల నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేర్వేరుగా పల్లకీల్లో కల్యాణ మండపానికి తీసుకొస్తారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ప్రతిరూపమైన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు మాంగల్యధారణ గావిస్తారు. దీంతో ఉత్సవం ముగుస్తుంది. సాధారణ వివాహాలలో మాదిరిగానే నారసింహుడి కల్యాణంలో కూడా తలంబ్రాలు పోసుకోవడం, వివాహ వేడుకకు హాజరైన వారు వధూవరులకు చదివింపులు సమర్పించడం అనాధిగా వస్తోంది. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ఈ ఉత్సవాలను ముందుండి నడిపిస్తారని, అందుకే వీటిని బ్రహ్మోత్సవాలని పేరు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల సమేత నారసింహుడి కల్యాణం తిలకించడానికి ముక్కోటి దేవతలు విచ్చేస్తారని భక్తుల నమ్మకం. నేటి సాయంత్రం జరుగనున్న ఈ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణమంతా అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల గురించి అందరికీ తెలిసే విధంగా పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో విద్యుద్దీపాలతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు.


ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు




పట్టా ఫట్.!

- ఇంటి పట్టా కావాలా.. రద్దు చేయమంటారా..?
- కామారుపల్లి జగనన్న లేఅవుట్ లబ్ధిదారులకు బెదిరింపులు
- బలవంతంగా రిజిస్ట్రేషన్..
- నిర్మాణానికి అనువైన స్థలం కాదని వాపోతున్న బాధితులు

అనంతపురం సిటీ, మార్చి 19: పట్టా రిజిస్ట్రేషన్ చేయించుకుంటారా..స్థలాన్ని రద్దు చేయమంటారా.. అని బెదిరించి మరీ పట్టాలు జారీ చేస్తున్నారు. అధికార నేతలు స్థలం మార్చలేదు..కానీ మాట మార్చారు..కామారుపల్లిలో కేటాయించిన జగనన్న లేఅవుట్ స్థలాలు ఇళ్ల నిర్మాణానికి అనువు కాదని సాక్షాత్తు ప్రజాప్రతినిధులతో పాటు ఆశాఖ మంత్రి కూడా తీర్మానించారు. లబ్ధిదారులకు మరోచోట స్థలాలు కేటాయించి పత్రాలు మార్చి ఇస్తామన్నారు. ఇదంతా మూడేళ్లకిందటి మాట.. ఆ దిశగా ఏమాత్రం ప్రభుత్వం అడుగేయలేదు. చివరికి ఎన్నికల ప్రక్రియ కూడా రావడంతో అదే లేఅవుట్‌లోని లబ్ధిదారులపై ఒత్తిడి చేసి మరీ అక్కడే బలవంతపు రిజిస్ట్రేషన్లు చేయిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. కొందరు లబ్ధిదారులు నిరాకరిస్తుండటంతో సంబంధిత వీఆర్వోలు, సచివాలయ అడ్మిన్‌లపై ఒత్తిడి చేసి పనులు సాగిస్తుండటం గమనార్హం. చివరికి రిజిస్ట్రేషన్ చేసుకుంటే పట్టా ఉంటాదీ.. లేకుంటే రద్దు చేస్తాం.. అంటూ పలు రకాలుగా లబ్ధిదారులను బెదిరిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఇచ్చిన హామీలను మరవడమే కాకుండా..పెద్దఎత్తున పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్లు చేయించి ఇచ్చామని చెప్పుకుంటున్నారు. ఓట్లు దండు కోవడం కోసం నేతలు చేస్తున్న మాయలు లబ్ధిదారులకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి.

● మాట మార్చారు..

నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు పథకం కింద ప్రభుత్వం అనంతపురం రూరల్ మండల పరిధిలోని కామారుపల్లి జగనన్న లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. 7,308మంది (అనంతపురం నగరం, అనంతపురం రూరల్, రాప్తాడు తదితర ప్రాంతాల్లో) పేదలకు ఇక్కడ స్థలాలు కేటాయించారు. అయితే స్థలాలు పొందిన సంతోషం కొన్నాళ్లయినా దక్కలేదు. అక్కడికి వెళ్లి చూసిన లబ్ధిదారులు ఆ స్థలం చూసి అవాక్కయ్యారు. కారణం అది ఇంటి నిర్మాణానికి ఏమాత్రం అనువుకాని భూమి, ఇసుక, చవుడు నిండి బురదమయంగా ఉంది. లబ్ధిదారులు తమకు ఇంటి పట్టాలు వద్దని వేరే చోట కేటాయించాలని మొర పెట్టుకున్నారు. పరిశీలించిన నాయకులు వారికి వేరేచోట స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అది అమలుకు నోచుకోలేదు.



రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే రద్దు చేస్తాం..

కామారుపల్లి లేఅవుట్ లబ్ధిదారులకు మరోకచోట ఇంటి పట్టాలు ఇచ్చే పరిస్థితి లేదు. పైగా ఎన్నికల ప్రక్రియ వచ్చేసింది. ఎన్నికల్లోపు రిజిస్ట్రేషన్లు ప్రక్రియ జరగకపోతే పార్టీకి ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. ఏం చేస్తారో.. మాకు తెలియదు.. ఏలాగైనా లబ్ధిదారులను ఒప్పించి లబ్ధిదారులపై రిజిస్ట్రేషన్లు చేయించే బాధ్యత ఆయా సచివాలయాల వీఆర్వోలు, అడ్మిన్‌లు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులతో పాటు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. అయితే మరోచోట ఇస్తామన్నారు..మళ్లీ ఇప్పుడేంటి అంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే నేతల ఒత్తిడి తట్టుకోలేక అధికారులు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ఇంటి పట్టా రద్దు చేస్తాం.. కొత్త వాళ్లకు ఇస్తాం.. అని బెదిరించి మరీ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.ఎన్నికల వేళ బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించడం ఏంటని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఎందుకూ పనికి రాని స్థలాలు తీసుకుని మేమేం చేసుకోవాలి..అని వాపోతున్నారు. వారితో ఎదురు దాడికి దిగలేక.. తప్పనిసరి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

మోసం చేశారు: ఓ మహిళ ఆవేదన

మాది అనంతపురం నగరం. నేను నా భర్త కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. ఎన్నికల సమయంలో ప్రతి పేదవాడికి ఇంటి పట్టా ఇస్తారని చెప్పడంతో నేను నా భర్త వైసీపీకి ఓటు వేశాం. అధికారంలోకి రాగానే.. ఎన్నికల్లో చెప్పినట్లుగానే మాకు.. ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చింది. కానీ నిర్మాణానికి ఏమాత్రం పనికిరాని కామారుపల్లి లేఅవుట్‌లో ఇచ్చారు. దీంతో అధికారుల వద్దకు వెళ్లి మొర పెట్టుకోగా స్థలం మార్చి ఇస్తామన్నరు. చివరికి మాపై ఒత్తిడి చేసి మరీ అదే చోటే రిజిస్ట్రేషన్ చేసి పట్టా ఇచ్చారు. అందరమూ మోసపోయాం..

పట్టా వద్దన్నా: ఓ లబ్ధిదారు

మాది అనంతపురం. మాకు ఏమాత్రం అనువుకానీ కామారుపల్లి లేఅవుట్‌లో పట్టా ఇచ్చి.. మమ్మల్ని మోసం చేశారు. నిలదీస్తే.. మరొకచోట ఇస్తామని నమ్మించారు. ఎన్నికల ప్రక్రియ రావడంతో మాకు మరోకచోట ఇవ్వకుండా అదే లేఅవుట్‌లోనే రిజిస్ట్రేషన్ చేస్తామని అధికారులు మా వద్దకు వచ్చారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే రద్దు చేస్తామని బెదిరించారు. మీరు బెదిరించేదీ ఎందుకు మాకు కామారుపల్లిలో ఇంటి పట్టా వద్దు.. రిజిస్ట్రేషన్ కూడా వద్దని వెనక్కి పంపాను. వచ్చే ప్రభుత్వంలోనైనా ఇంటి పట్టా తీసుకుని ఇల్లు కట్టుకుంటాం.

విద్యుత్ షాక్‌తో చిరుత మృతి

కూడేరు, మార్చి 19: మండలంలోని పి. నాగిరెడ్డిపల్లి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన దిమ్మెను ఎక్కిన చిరుత విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన మేరకు.. సోమవారం రాత్రి ఓ చిరుత గ్రామ సమీపంలోని బాలరాజు తోట వద్దకు వెళ్లింది. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎక్కింది. దీంతో విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. మంగళవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న కొందరు రైతులు చిరుత మృతి చెందినట్లు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే డీఎఫ్‌ఓ వినీత్ కుమార్, ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాసులు, డిప్యూటీ రేంజ్ అధికారి హరిసేనప్ప, తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని చిరుత మృతిపై ఆరా తీశారు. సంఘటన స్థలంలోనే పశువైద్యాధికారి శ్రీనివాసులు చిరుతకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు.


చిరుత కళేబరం


పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

జొన్న చిగురు తిని 80 గొర్రెలు మృతి

- రూ.9 లక్షల నష్టం

బెళుగుప్ప, మార్చి 19: మండలంలోని గంగవరం గ్రామసమీపంలో జొన్నచిగురు తిని సోమవారం రాత్రి 80 గొర్రెలు మృతి చెందాయి. కంబదూరు మండలం పి.వెంకటంపల్లి గ్రామానికి చెందిన లాల్యానాయక్‌కు తనకున్న 300 గొర్రెలను మేత కోసం కొన్ని రోజుల కిందట బళ్లారికి తీ సుకెళ్లాడు. స్వగ్రామానికి మందతో తిరిగి వస్తుండగా చీకటి పడటంతో గంగవరం వద్ద ఆగారు. ఆ సమయంలో పిల్లలకు పాలు తాపుతుండగా కొన్ని గొర్రెలు రోడ్డు పక్కనే ఉన్న కోతకోసిన జొన్న పొలంలోకి వెళ్లాయి. అక్కడ జొన్న చిగురు తిని అస్వస్థతకు గురై రాత్రి చనిపోయాయి. దాదాపు రూ.9 లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలంటూ యజమాని కోరారు. పశువైద్యాధికారి రమేష్ మంగళవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పంట కోత కోసిన తర్వాత వచ్చిన చిగురు విషపూరితంగా ఉంటుందని, దాన్ని తినడంతోనే గొర్రెలు చనిపోయాయన్నారు. నష్టపరిహారపు నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నామన్నారు.


గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి రమేష్

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

తాడిమర్రి, మార్చి 19: మండలంలోని నారసింపల్లి గ్రామంలో మంగళవారం పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్ఐ నాగస్వామి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నారసింపల్లికి చెందిన గోగుల గంగాధర్ కుమారుడు గోగుల విజయ్(15) బత్తలపల్లిలోని జిల్లాపరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతుండడంతో.. సోమవారం జరిగిన పరీక్షకు హాజరయ్యాడు. అయితే మంగళ వా రం హిందీ పరీక్షకు వెళ్లాల్సి ఉండగా.. స్నానానికి వెళ్లి బాత్రూంలో ఉరివేసుకున్నాడు. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు కిటికీలోంచి చూడగా.. ఉరికి వేళాడుతూ కనిపించాడు. వెంటనే వారు తలుపు బద్దలు కొట్టి అతడిని కిందకి దించారు. కొనఊపిరి ఉండడంతో హుటాహుటిన బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వవైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 7:30గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో రాణిస్తారనుకుంటే ఇలా మధ్యలోనే జీవితం ముగిసిపోయిందని రోదించారు. హిందీపరీక్ష సరిగ్గా రాయగలనో.. లేదోనని భయపడేవాడని కుటుంబ సభ్యులు చెప్పారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


గోగుల విజయ్(ఫైల్)




వైసీపీ డీలా

- టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏర్పాటుతో కంగారు
- కూటమిదే అధికారమని జాతీయ సర్వేల వెల్లడి
- వైసీపీ అభ్యర్థుల్లో అయోమయం
- కూటమి అభ్యర్థుల్లో కదనోత్సాహం
- నేడో.. రేపో ఆ రెండు నియోజకవర్గాలకు అభ్యర్థుల ఖరారు



అనంతపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీ డీలా పడుతోందా అంటే అవుననే సమాధానమే ఎటుచూసినా వినిపిస్తోంది. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతోంది. అటు కూటమి, ఇటు వైసీపీ అభ్యర్థులను ఆయా పార్టీల అధినాయకత్వం అధికారికంగా ప్రకటించింది. దీంతో జిల్లాలో రాజకీయ వేడి పెరిగింది. ఏ హోటల్ వద్ద చూసినా, ఏ కేఫ్ వద్ద చూసినా రాజకీయ చర్చలే జరుగుతున్నాయి. ప్రజల్లో చర్చ జోరుగా సాగుతున్నా, అభ్యర్థుల్లో మాత్రం ఇంకా ఆ జోష్ కనిపించడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో నెల దాకా గడువు ఉండటం దీనికి ఒక కారణమైతే, అసంతృప్తుల బుజ్జగింపులు, ఇతర వ్యవహారాలపై దృష్టి సారించడం ఇంకో కారణం.

సర్వేలన్నీ కూటమివైపే..



టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఖరారు కావడంతో సర్వేలన్ని కూటమే అధికారం చేపట్టబోతోందని తేల్చాయి. జాతీయ సర్వేలతో పాటు స్థానిక సర్వేలు కూటమివైపే మొగ్గుచూపాయి. పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమికే మెజార్టీ స్థానాలు దక్కుతాయని స్పష్టంగా వెల్లడించాయి. సర్వేలన్నీ కూటమికే పట్టం కడుతుండటంతో వైసీపీ అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సమాయత్తం కావడం, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపక్రమించడం వైసీపీ అభ్యర్థులకు మింగుడు పడటం లేదు. ఆదినుంచి వలంటీర్లే వైసీపీకి ప్రచారకర్తలుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం వలంటీర్లను పక్కనబెట్టడం వైసీపీ అభ్యర్థులకు ప్రాణసంకటంగా మారింది. తానొకటి తలిస్తే.. దైవం మరొకటి తలచిందన్నట్లుగా వైసీపీ అభ్యర్థుల పరిస్థితి తయారైందన్న భావన ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

కూటమితో కంగారు



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీలో కంగారు మొదలైందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రాజకీయ విశ్లేషకులు, మేధావివర్గాలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. సింహం సింగిల్‌గా వస్తుందని అంటూ.. వైసీపీ నేతలు కూటమి నేతల్లో చీలికలు తెచ్చేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా, అవి ఫలించడం లేదు. ఇది అధికార వైసీపీని మరింత కుంగుబాటుకు గురిచేస్తోంది. ఐదేళ్ల వైసీపీ పాలన చూసిన అన్ని వర్గాల ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును స్వాగతిస్తున్నారు. ఇదే వైసీపీలో అలజడికి ప్రధాన కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు వైసీపీ అభ్యర్థులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పైకి 'వై నాట్ 175' అని బీరాలు పలుకుతున్నప్పటికీ... అంతర్గతంగా అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నట్లు ఆ పార్టీవారే చర్చించుకుంటున్నా రు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లా పర్యటనకొచ్చిన సందర్భాల్లో జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదనే భయం వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది. ఐదేళ్లల్లో ఒక ప్రాజెక్టును కూడా పూర్తీ చేయకపోవడం, ఒక ఎకరాకూ సాగునీరు ఇవ్వకపోవడం, ఒక్క పరిశ్రమనూ తీసుకురాకపోవడం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోవడం వంటి ప్రధాన అంశాలు వైసీపీ అభ్యర్థుల్లో మరింత అలజడికి కారణమవుతున్నాయి. నవరత్నాలు మినహా, జిల్లాకు చెప్పుకోదగ్గ అభివృద్ధి పనిచేయలేదు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమనేది ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సాధారణమని ప్రజలు అంటున్నారు.

కూటమి అభ్యర్థుల్లో కదనోత్సాహం

గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో.. కూటమి అభ్యర్థులు కదనోత్సాహంతో ఉన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేయడంలో కూటమి అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే తొలివిడతలో జిల్లాలోని 8 నియోజకవర్గాలకుగానూ 6 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అభ్యర్థులను టీడీపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో... రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు, రాప్తాడులో పరిటాల సునీత, ఉరవకొండలో పయ్యావుల కేశవ్, కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రిలో జేసీ అస్మిత్ రెడ్డి, శింగనమలలో బండారు శ్రావణిశ్రీ ప్రచార వేగాన్ని పెంచారు. ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పార్టీ శ్రేణులు అదే జోష్‌తో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

నేడో.. రేపో.. ఆ రెండు స్థానాలకూ..

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకుగానూ ఆరు నియోజకవర్గాలకు అధికారికంగా టీడీపీ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేసింది. అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. రెండు రోజుల్లో వీటికీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. గెలుపు గుర్రాల కోసం పార్టీ అధిష్టానం తీవ్ర కసరత్తు చేయడమే జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. నేడోరేపో పార్లమెంటు అభ్యర్థి ఎవరనేది అధికారికంగా ప్రకటిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 19: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఫార్మసీ పరీక్షల ఫలితాలనను విడుదల చేశామని మంగళవారం డైరెక్టర్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. జనవరి, ఫిబ్రవరిలో బీటెక్ మూడవ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్20)రెగ్యులర్‌తోపాటు (15,19) సప్లమెంటరీ నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ద్వితీయ సెమిస్టర్(ఆర్20,21,15)పరీక్షలు. ప్రథమ, ద్వితీయ సెమిస్టర్(ఆర్15) లాస్ట్‌ఛాన్స్ పరీక్షలు జరిగాయన్నారు. ఎంఫార్మసీ మూడవ సెమిస్టర్(ఆర్22) రెగ్యులర్, సప్లమెంటరీ. (ఆర్17) సప్లమెంటరీతో పాటు ఫార్మాడీ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం(ఆర్17), తృతీయ సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫార్మాడీ(పీబీ) విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. ఫలితాలకోసం www. jntua. ac.in సందర్శించాలని సూచించారు.

టీడీపీతోనే మాదిగలకు భవిష్యత్తు

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగినాగ

అనంతపురం అర్బన్, మార్చి 19: తెలుగుదేశం పార్టీతోనే మాదిగలకు అభివృద్ధి, భవిష్యత్ ఉంటుందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగినాగ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులు జాంబవంతుడు, చిన్న వెంకటేష్, పెద్ద వెంకటేష్, రిషి వర్ధన్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో మాదిగలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని రద్దు చేసి మాదిగలకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని మందకృష్ణ మాదిగ ఇటీవల



మీడియాతో మాట్లాడుతున్న బంగినాగ

ప్రకటించారని గుర్తు చేశారు. రాబోవు ఎన్నికల్లో మాదిగలంతా ఏకమై టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

'ప్రజాగళం'లో భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

శింగనమల,మార్చి 19: సాక్ష్యాత్తు ప్రధానమంత్రి పాల్గొన్న ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నధికారులపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ సభలో లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతమని.. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆ సభ విజయవంతమైందన్నారు.

ముగిసిన త్రిపుష్కర వార్షికోత్సవాలు

అనంతపురం కల్చరల్, మార్చి 19 : ప్రభుత్వ సర్వజనా స్పత్రి రోడ్డులోని దత్తాత్రేయ మందిరంలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న త్రిపుష్కర వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో దత్తహోమం, ఆంజనేయ, ఆవాహిత దేవతా హోమాలు నిర్వహించి మహా పూర్ణాహుతి గావించారు. అనంతరం గణపతి సచ్చిదానంద స్వామి ప్రధాన శిష్యుడు దత్తవిజయానందతీర్థ స్వామి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామి జ్ఞానబోధ సభ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ శర్మ గోసాల, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మంగళవారం సాయంత్రం పాతూరు దత్తాత్రేయ మందిరాన్ని దత్తవిజయానందతీర్థస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా గర్భాలయంలో దత్తదేవునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తులకు ఆధ్యాత్మిక సందేశమివ్వడంతోపాటు ఫల ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి అప్పా సుధీర్, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





పూజలు నిర్వహిస్తున్న స్వామీజీ, నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైసీపీ ప్రలోభాలకు మళ్లీ మోసపోకండి

శింగనమల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



రోటరీపురంలో శ్రావణిశ్రీ, ఆలం, కేశవరెడ్డి ప్రచారం

బుక్కరాయసముద్రం, మార్చి 19: గత ఎన్నికల సమయంలో అనేక ప్రలోభాలకు గురి చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి... రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేశాడని శింగనమల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ మండిపడ్డారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని, వాటిని నమ్మకుండా ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెంచి.. ఎన్నికల సమయంలో తాను పెట్టిన ఖర్చుకు వందల రెట్లు దోపిడీ చేస్తాడని, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి కావాలంటే... మరోసారి సీఎంగా చంద్రబాబు రావాలన్నారు. మంగళవారం మండలంలోని రోటరీపురం, కొర్రపాడు గ్రామపంచాయతీలో ఆమెతోపాటు ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండలంలోని కొర్రపాడు వైసీపీ మాజీ సర్పంచ్ చలపల లింగారెడ్డితో సహ పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

శ్రావణిశ్రీ గెలుపే లక్ష్యం

శింగనమల : శింగనమల మండలంలో బండారు శ్రావణిశ్రీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురంలో బండారు శ్రావణిశ్రీ స్వగృహం వద్ద శింగనమల టీడీపీ మండల నాయకులతో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మండల కన్వీనర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : రాప్తాడు మండలం బోగినేపల్లిలో మాజీ మంత్రి పరిటాల సునీత సోదరుడు ధర్మవరపు మురళి, టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే సీకేపల్లి మండలంలోని బసినేపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణచౌదరి ఆధ్వర్యంలో, అనంతపురంరూరల్ మండలంలోని పాముూరాయిలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముూరాయి రఘు ఆధ్వర్యంలో, రామగిరి మండలం శ్రీహరిపురంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య ఆధ్వర్యంలో, కనగానపల్లి మండలంలోని భానుకోట గ్రామంలో, ఆత్మకూరు మండలంలోని వేపచెర్ల, ఎగువ తండా, దిగువ తండా గ్రామాల్లో మండల ఇన్‌చార్జి బాలాజీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



బోగినేపల్లిలో..



బసినేపల్లిలో ..



పాముూరాయిలో ..



శ్రీహరిపురంలో ..



భానుకోటలో ..



వేపచెర్లలో ..

ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్‌కు షోకాజ్ నోటీసులు

శింగనమల, మార్చి 19: ఎన్నికల అధికారులు ఆదేశాలను ధిక్కరించి.. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్, వలంటీర్ వెంకటేశ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ బీవీ రమణ మంగళవారం తెలిపారు. రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల ఆదేశాల మేరకు ఆ ఇద్దరికి షోకాజ్ నోటీస్‌లు అందజేశామన్నారు.

ప్రమోషన్లు వచ్చినా అవే సీట్లే..

అనంతపురం క్రైం, మార్చి 19: నగరపాలికలో కొందరికి ఉద్యోగోన్నతులు వచ్చినా... అవే సీట్లలో కొనసాగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. నగరపాలికలో కొన్ని సంవత్సరాలుగా శానిటరీ సూపర్ వైజర్ సీటులో ఎవరినీ నియమించలేదు. తాజాగా ముగ్గురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు దక్కాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నాగార్జునకు శానిటరీ సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ దక్కింది. కానీ అతను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గానే ఉంటూ డంపింగ్ యార్డ్ పర్యవేక్షకుడిగా పనిచేస్తున్నాడు. మలేరియా ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్న అంజినేయులుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. కానీ అతనికి పూర్తిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించనట్లు తెలిసింది. ఇక జనన మరణ విభాగంలో పీహెచ్ మేస్త్రీగా ఉన్న శంకరయ్యకు మలేరియా ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి దక్కింది. ఆయనకు ఆ విభాగం వదలి పెట్టడానికి మనసు ఒప్పినట్లు లేదు. అతను ఎక్కువ సమయం జనన-మరణ విభాగంలోనే గడుపుతున్నట్లు సమాచారం.

ఎన్నికల వేళ సమన్వయంతో పనిచేయాలి: ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 19: ఎన్నికల వేళ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని విభాగాలూ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. ఎన్నికల కోసం ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఎలెక్షన్ వింగ్స్‌తో మంగళవారం తన చాంబర్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్, సెబ్, ఏఆర్, సైబర్, ఐటీ కోర్ తదితర విభాగాల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీ ఆంథోనప్ప, సీఐలు జాకీర్‌హుస్సేన్, ఇందిర, షేక్ జాకీర్, విశ్వనాథచౌదరి, సంజీవకుమార్ పాల్గొన్నారు.

రేపటి సమావేశాన్ని జయప్రదం చేయండి

గార్లదిన్నె, మార్చి 19: విజయవాడలో రెవెన్యూ భవనంలో గురువారం నిర్వహించనున్న ఈసీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా సహా అధ్యక్షుడు తలారి నాగరాజు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ఈసీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ ఏపీజేఏసీ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు, ట్రెజర్ చెన్నుపల్లి సత్యానారాయణ, సహాధ్యక్షుడు రామాంజనేయులు హాజరవుతున్నారని అన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

గార్లదిన్నె, మార్చి 19 : మండలంలోని కోటంక సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. కోటంక గ్రామ సమీపంలోని గుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా అనంతపురానికి తరలిస్తున్న ఆ టిప్పర్లను పట్టుకుని మైన్స్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు.

స్వీయరక్షణపై శిక్షణ

అనంతపురం సెంట్రల్, మార్చి 19: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం క్రైకాండో ట్రైనర్ శాంతరాజు విద్యార్థులకు స్వీయరక్షణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా కమిటీ చైర్మన్ మాధవి మాట్లాడుతూ... స్వీయరక్షణ జీవిత నైపుణ్యమని, ఊహించని వాటిని ఎదుర్కోవడానికి సహాయపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, డాక్టర్ స్మిత పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

అనంతపురం సెంట్రల్, మార్చి 19: ఎస్కేయూ మహిళల బ్యాడ్మిటన్ జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ క్రీడా విభాగ కార్యదర్శి శ్రీనివాసన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం వీసీ హుస్సేన్‌రెడ్డి అభినందించారు. తమిళనాడులో 21 నుంచి 24 వరకు నిర్వహించే అంతర్గత వర్సిటీల పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని శ్రీనివాసన్ పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

అనంతపురం రూరల్, మార్చి 19: మండలంలోని కురుగుంట గ్రామ వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్న టీడీపీ నాయకుడు ఖాదర్ బాషా అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. అతని మృతదేహానికి టీడీపీ తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మేంద్ర, రంగా, జాఫర్, సుబ్బరాయుడు, మణికంఠ పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు మార్చి 19: మండలంలోని పంపనూరు సుబ్రమ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి.. అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ, సిబ్బంది పాల్గొన్నారు.



రెండో రోజు 1903 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 19: పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 32,301 మంది విద్యార్థులకు గాను 1903 మంది గైర్హాజర్ అయ్యారని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజుతో పోలిస్తే... రెండో రోజు కేంద్రాల వద్ద హడావిడి తగ్గింది. మంగళవారం 142 కేంద్రాల్లో హిందీ పరీక్ష నిర్వహించారు. ఎండలు మండిపోతున్నాయని కానీ పలు కేంద్రాల్లో మంచినీళ్లు సరిగ్గా ఏర్పాటు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏసీ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా... అన్ని కేంద్రాల్లో మంచినీళ్ల కూల్ క్యాన్స్ తగినన్ని ఏర్పాటుచేసేలా పరీక్షల సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక క్యాన్ అందుబాటులో ఉంచేలా ఆదేశాలున్నాయని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయండి : జేసీ

అనంతపురం టౌన్ : జేఎన్‌టీయూలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలకు అన్ని ఏర్పాట్లు నిబంధనల మేరకు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రిటర్నింగ్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి పార్కింగ్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ మ్యాప్స్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి. కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్. ఆర్‌ఓలు వెంకటేష్, శ్రీనివాసులు, రాంభూపాల్‌రెడ్డి. కరుణకుమారి. వసంతబాబు. వెన్నెలశీను పాల్గొన్నారు.

బాలింతకు చేయూత

అనంతపురం కల్చరల్, మార్చి 19: ఆర్థిక కష్టాలతో ఇబ్బందు లెదుర్కొంటున్న నిరు పేద బాలింతకు నిత్యసు రభి ట్రస్టు అండగా నిలిచింది. కళ్యా ణదుర్గం రోడ్డు బాలాజీ విల్లాస్ సమీపంలో నాగరత్న అనే నిరుపేద మహిళ ఇటీవల ఓ పాపకు జన్మనిచ్చింది. ఆర్థిక కష్టాలెదుర్కొంటుండడంతో నిత్య సురభి ట్రస్టును ఆమె ఆశ్రయించారు. దీంతో ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి మంగళవారం నాగరత్న నివాసానికి చేరుకుని రూ.5వేలు నగ దుసాయంతో పాటు 25 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌజన్య, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి

అనంతపురం కల్చరల్, మార్చి 19: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని గుత్తిరోడ్డులోని సీపీఎం కొత్త కాలనీలో ఆమె చిత్ర పటానికి పలువురు నివాళులర్పిం చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, బాబు, వెంకటనారాయణ, వలి, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, డేవిడ్, మురళి, రాజు, రవి, గీత, శంషాద్, లాలమ్మ, పక్రున్నీ పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,500, కనిష్ఠం గా రూ.10 వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 417 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విద్యాశాఖ స్వామి భక్తి



అనంతపురం విద్య, మార్చి 19: జిల్లా విద్యాశాఖ అధికారులకు సీఎం జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణపై భక్తి తగ్గడం లేదు. ఎన్నికల కోడ్ అమలలోకి వచ్చినా ప్రభు భక్తి చాటుతూనే ఉన్నారు. జిల్లాలో ఐదేళ్లు నిండిన విద్యార్థులలో అర్హులకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లు ఇస్తామని ఇటీవల విద్యాశాఖ పెద్ద ఎత్తున పోస్టర్లతో ప్రచారం చేసింది. డీఈఓ ఆఫీసుతోపాటు ఎంఈఓల కార్యాలయాల వద్ద జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు ఈ పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఓ వైపు సీఎం జగన్ ఫొటో, మరో వైపు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఫొటోతో విశాలమైన ఫెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ నెల 16వ తేదీన ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కాబట్టి ఈ ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించాలి. ఎన్నికల అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయినా.. విద్యాశాఖ అధికారులు తొలగించలేదు.

డీఈఓ కార్యాలయంలో సీఎం జగన్, మంత్రి బొత్స ఫొటోలున్న పోస్టర్లు

ఘనంగా బలిజ సంఘం నేత రమేష్ జన్మదినం



కేక్ కట్ చేస్తున్న రమేష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 19: రాయలసీమ బలిజ మహాసంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్ జన్మదిన వేడుకలను ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో రమేష్ కేక్ కట్ చేయగా.. పలువురు శుభాకాంక్షలు తెలిపారు. రమేష్ యువసేన ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులకు అన్నదానం నిర్వహించారు. అదే విధంగా కమలానగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, అన్నదానం చేశారు.

గడ్డి లారీ దగ్ధం



శింగనమల, మార్చి 19: మండలంలోని చక్రాయపేట వద్ద వరిగడ్డి తీసుకొస్తున్న లారీకి గుర్తు తెలియ వ్యక్తులు నిప్పు పెటడ్డం తో... వరి గడ్డితో పాటు లారీ పూర్తి దగ్ధమైంది. గుడివాడ నుంచి డ్రైవర్ సురేష్ అనంతపురానికి లారీలో వరిగడ్డిని లోడ్ చేసుకొని బయలుదేరాడు. మంగళవారం మధ్యాహ్నం నాయనపల్లి క్రాస్ నుంచి చక్రాయపేట వద్దకు రాగానే వరి గడ్డికి ఒక్కసారిగా మంటలు వ్యాపించి.. గడ్డితో పాటు లారీ పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ సురేష్ మాట్లాడుతూ... చక్రాయపేట వద్దకు రాగానే ఇద్దరు వ్యక్తులు బైక్‌లో వచ్చి గడ్డికి నిప్పు పెట్టారన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివాహానికి దండు సాయం

శింగనమల: తరిమెల గ్రామానికి చెందిన ముద్దలను నాగప్ప కుమారుడు నాగరాజు వివాహానికి దండు శ్రీనివాసులు రూ.10 వేలను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి గంగాధర్ కుళ్లాయప్ప, బెస్తనారాయణ స్వామి, ప్రసాద్‌నాయక్, దండు ప్రకాశ్, పుల్లయ్య, రామదాసు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం క్రైం : స్థానిక మూడో రోడ్డుకు చెందిన నరేంద్రగౌడ్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా కుటుంబసభ్యులతో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం సరుకులు తీసుకొస్తానని బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఓటు వినియోగంపై అవగాహన

అనంతపురం సెంట్రల్ : ఓటు హక్కు వినియోగంపై సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పలు ప్రాంతాలను పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిషాల్, మధు, సృజన, సంభవ్, ఆశీర్వాద్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

అనంతపురం సెంట్రల్, మార్చి 19: ఆర్ట్స్ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు మంగళవారం ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తెలిపారు. బెంగళూరు ఆల్‌సెక్ టెక్నాలజీ, సర్వసాయి ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.



జనసేన ఆడియో సీడీ విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీకు కొత్త ఊపు ఇచ్చేలా జనసేన నాయకులు కాయగూరల లక్ష్మీపతి ఆధ్వర్యంలో రూపొందించిన ఆడియో సీడీని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు ఆవిష్కరించారు. మంగళవారం మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయానికి వెళ్లిన లక్ష్మీపతి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ నాగబాబు చేతుల మీదుగా ఆ సీడీని ఆవిష్కరింపజేశారు. ఆడియో చాలా బాగుందని.. ఎన్నికల కోసం వాడుకుందామని నాగబాబు చెప్పినట్లు లక్ష్మీపతి తెలిపారు. వారివెంట ఆ పార్టీ నాయకుడు చైతన్యకృష్ణ ఉన్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న నాగబాబు చిత్రంలో టీసీ వరుణ్, లక్ష్మీపతి

రేణుకా యల్లమ్మ సాక మహోత్సవాలకు శ్రీకారం

అనంతపురం కల్చరల్, మార్చి 19: పాతూరు సున్నపువీధిలోని చంద్రగుత్తి రేణకా యల్లమ్మ దేవాలయంలో సాక మహోత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు జిల్లా నలుమూలల నుంచి కురుబలు పెద్దసంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆలయం వెలుపల పెద్దఎత్తున సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ సామూహికంగా కోలాటమాడారు. రాత్రికి సమూహిక భజనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి శాంతిపూజ, 11 గంటలకు అన్నదానం, సాయంత్రం అమ్మవారి నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యవర్గం పేర్కొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండి చంద్రశేఖర్‌గౌడ్, సభ్యులు పెద్ద బాలఓబన్న, చిన్న ఓబన్న, ఓబయ్య, నాగరాజు, ప్రసన్నకుమార్, పెద్ద ఓబులేసు, నరేష్, దీక్షిత్, పుల్లన్న, కౌశిక్, మునలన్న పాల్గొన్నారు.





ఆలయం వెలుపల కోలాటమాడుతున్న భక్తులు

అమిలినేనికి పెరుగుతున్న ఆదరణ



కరపత్రాన్ని అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి

కళ్యాణదుర్గం, మార్చి 19: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు నియోజకవర్గంలో రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. మహిళలు, ఆయా గ్రామాల ప్రజలు, అభిమానులు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని ఓబుళాపురం, నుసికొట్టాల, నుసికొట్టాల తండా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, చెల్లెలు రాధ మహిళలతో కలిసి ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అదే స్ఫూర్తితో ఈ సారి అఖండ మెజార్టీతో కళ్యాణదుర్గంలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న సురేంద్రబాబు చెల్లెలు రాధ

22న హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లుటౌన్, మార్చి19: పట్టణంలోని ఆర్‌టీస్ట్రీట్‌లో వెలసిన కోదండ రామస్వామి దేవాలయం, రాతిగుడిరామస్వామి దేవాలయం హుండీ ఆదాయం లెక్కింపును ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాతిగుడి రామస్వామి దేవాలయంలో ఉదయం 9.30గంటలకు, కోదండరామస్వామి దేవాలయంలో 11.30గంటలకు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కిస్తామన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉద్యోగ అవకాశాలు



శిక్షణ పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

గుంతకల్లు టౌన్, మార్చి 19: నైపుణ్యాభివృద్ధి శిక్షణతోనే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో మంగళ వారం ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సహకారంతో విజయవాడ నాంది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్యాలీ, సాఫ్ట్ స్కిల్స్, జీఎస్‌టీపై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌ల ప్రధాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ చదువుతున్న విద్యార్థులకు ఆరు రోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు సాధన చేయడం ద్వారా బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చున్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ చేతుల మీదుగా సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ సమన్వయకర్త బాలగంగాధర్‌తిలక్, పౌరసంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్ సురేష్‌బాబు, పీ శ్రీనివాసులు, కార్యాలయ పర్యవేక్షకులు రఘు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో కాలనీవాసులు

ఉరవకొండ, మార్చి 19: పట్టణంలోని 14 వార్డులోని ఎస్‌ఎల్ఎన్ కాలనీలోని ప్రజలు మంగళవారం తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వాపోయారు. తాగునీటిని సరఫరా చేయాలని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. నెల రోజులుగా తాగునీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వదిలినప్పుడు కనీసం ఒక్క బిందెకూడా నీరు రావడం లేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

భార్యపై దాడి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 19: భార్యపై విచక్షణారహితంగా భర్త దాడి చేసి గాయపరిచిన సంఘటన శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితురాలు జయమ్మ తెలిపిన మేరకు తన భర్త రామకృష్ణ వివాహేతర సంబంధంలో మునిగిపోయి తనను, తన పిల్లలను పట్టించుకోవడం లేదన్నారు. దీన్ని ప్రశ్నించినందుకు చితకబాదాడన్నారు. రోజూ హింసను భరించలేక పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కట్నం కింద ఒక ద్విచక్రవాహనం, పలు దఫాలుగా రూ. 3 లక్షలు ఇచ్చి నట్లు బాధితురాలు ఆరోపించారు. తన భర్త, అత్తమామల బారి నుంచి తనను కాపాడాలని పోలీసులను వేడుకున్నారు. గాయపడిన ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నదాతకు అన్యాయం: కాలవ

డీ.హిరేహాళ్, మార్చి 19: వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టేసి రైతులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అడుగడుగునా అన్యాయం చేస్తున్నాడని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలోని కల్యం గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, వ్యవసాయకూలీలు జగన్ ప్రభుత్వంపైన తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. చంద్రబాబు పాలనలో 50 వేలు రుణం ఉన్నవారికి ఒకేసారి, మిగిలిన వారికి రూ.లక్ష వరకు మాఫీ చేశారన్నారు. మళ్లీ సీఎంగా చంద్రబాబు వచ్చి ఉంటే ఐదోసారి, ఆరోసారి కూడా మాఫీ జరిగి ఉండేదని పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన సహాయంలో పావలా శాతం కూడా జగన్ చేయడం లేదని విమర్శించారు. సబ్సిడీ డ్రిప్ పథకాన్ని మూలన పడేశాడన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఐదేళ్ల కాలంలో రాలేదని, వచ్చినా చాలా అరకొరగా సహాయం అందిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోహన్‌రెడ్డి, కల్యం మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కేపీదొడ్డి వైసీపీ కార్యకర్తలు

టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ

గుమ్మఘట్ట: టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం కేపీదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాలకు చెందిన గొల్ల కిష్టప్ప, కృష్ణారెడ్డి, గొల్ల రుద్రప్ప, బోయ ఈరన్న, చదం రంగప్ప, రాము, మాదిగ రామాంజనేయులుతో పాటు 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరికి కాలవ శ్రీనివాసులు కండువాలు వేసి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక అసమర్థుడిని వైసీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన నాయకత్వంలో పనిచేయడానికి ఎవరూ ఇష్టపడటం లేదన్నారు. మెట్టు గోవిందరెడ్డి నామినేషన్ వేసే నాటి నుంచి పోలింగ్ జరిగే నాటికి వైసీపీ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి ఉందన్నారు.



కల్యంలో ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

టీడీపీలో తటస్థుల చేరిక

రాయదుర్గం: పట్టణంలోని 9వ వార్డులో ఉండే తటస్థులైన కామూర్తి రుద్రయ్య, కామూర్తి మల్లికార్జున, సావె నాగరాజు, సావె చిక్కణ్ణ, బూదూరు మహేష్, బూదూరు మల్లికార్జులతో పాటు మరో పది కుటుంబాలు మంగళవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీలో చేరాయి. కామూర్తి రుద్రయ్య నివాసంలో వీరికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాంత శ్రీనివాసులు, పౌరాళ పురుషోత్తం, కంబ్లి రాజశేఖర్, టంకశాల హనుమంతు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపడానికి ప్రజలు సిద్ధం

బొమ్మనహాళ్, మార్చి 19: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి అన్నారు. మండలంలోని దేవగిరిక్రాస్‌లో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ నాయకులు మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బల రాంరెడ్డి, యర్రగుంట్ల వెంకటేశులు, మల్లీడు శీన, నవీన్, సైకిల్‌షాపు హనుమంత, సల్లాపురం బాబు, మాజీ డైరెక్టర్ నాగరాజు, హోటల్ రంగా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దేవగిరిక్రాస్‌లో బాబుష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

తెలుగుదేశంతోనే గ్రామాల అభివృద్ధి

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే గ్రామాలన్నీ అభివృద్ధి బాట పడతాయని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. మండలంలోని మల్కాపురం గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు అందిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కాలవ భరత్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలని, రాయదుర్గం నియోజకవర్గంలో కాలవ శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నూరు స్వామి, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, బొబ్బిలి కిష్టప్ప, సోమశేఖర్ ప్రసాద్, డాక్టర్ రామస్వామి, సిద్ధప్ప, లచ్చన్నచౌదరి, వీరేష్, వన్నూరప్ప, గోనబావి రమేష్, తిప్పేస్వామి, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని కోరే వారంతా టీడీపీలోకే..



పార్టీలో చేరిన వారితో జేసీపీఆర్

యాడికి, మార్చి19: గ్రామ అభివృద్ధి కోరే వారందరూ టీడీపీలోకి వస్తున్నారని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యాడికిలోని చిన్న వేపమానువీధిలో 30మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో హాజీబాషా, రామాంజనేయులు తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసే వారికి అండగా ఉండాలనే తామంతా టీడీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక పట్టుచీరల కొనుగోలు కేంద్రాలు యాడికిలో ఏర్పాటు అయ్యేలా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆదినారాయణ, బొట్టు శేఖర్, మధురాజు, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15మంది ఉద్యోగాలకు ఎంపిక

గుత్తి,మార్చి19: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో 15మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ తెలిపారు. బెంగళూరుకు చెందిన జేఎల్‌సీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో కళాశాలలో ఎంబీఏ చదువుతున్న 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

పుట్లూరు, మార్చి19: మండలంలోని పుట్లూరు, శనగలగూడూరు, మడుగుపల్లి, ఏ. కొండాపురం, కడవకల్లు గ్రామాల్లో మంగళవారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు ఎన్నికల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ హేమాద్రిలు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమ్మలదిన్నెలో బాబు ష్యూరిటీ

పెద్దపప్పూరు, మార్చి19: మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బీసీ రామకృష్ణారెడ్డి, గుర్తి రఘునాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ తొలగింపు

రాయదుర్గం, మార్చి 19: పట్టణంలోని 24వ వార్డులో వలంటీర్‌గా ఉన్న జే రవి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో అతడిని విధుల నుంచి తొలగిస్తూ మున్సిపల్ కమిషనర్ కిశోర్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థి తరఫున 24వ వార్డులో ప్రచారం చేస్తుండగా ఫిర్యాదులు అందాయి. దీంతో అతడిపై వేటు వేశారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

బొమ్మనహాళ్, మార్చి 19: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రామాంజినమ్మ హెచ్చరించారు. మంగళవారం బొమ్మనహాళ్‌లోని వెలుగు కార్యాలయంలో చౌక ధరల దుకాణపు డీలర్లు, ఎండీయూలతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీ నాయకులతో ప్రచారాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బియ్యం కోసం వచ్చే లబ్ధిదారులతో ఫలాన గుర్తుకు ఓటు వేయాలని చెప్పినా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, శృతి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు

బెళుగుప్ప, మార్చి 19 : మండలంలో మంగళవారం పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగినట్లు విద్యాశాఖాధికారి మల్లారెడ్డి తెలిపారు. రెండో రోజు పరీక్షలకు 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

భోజన విరామ సమయాన్ని మార్చాలి

కుందుర్పి, మార్చి 19: రాష్ట్రంలో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్న సందర్భంగా ఉదయం 10 గంటలకే విద్యార్థులకు భోజనం అందేలా భోజన విరామ సమయాన్ని మార్చాలని ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ విద్యాశాఖ అధికారులను కోరారు. విద్యాశాఖ ఇచ్చిన కాలమానిని మేరకు మధ్యాహ్నం 12.30కు విద్యార్థులకు భోజనం అందించాలి. కానీ ఉదయం ఇంటి నుండి ఎటువంటి ఆహారం తినకుండా వచ్చిన విద్యార్థులు మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆకలితో ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆయన అన్నారు. రాగిజావలేని రోజుల్లో విద్యార్థులు మరింతగా ఇబ్బందులు పడుతుతున్నారని అన్నారు. విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో వుంచుకుని భోజన విరామ సమయాన్ని ఉదయం 10 గంటలకు మార్చాలని కోరారు.

అంబులెన్స్ బోల్తా

రాయదుర్గం, మార్చి 19: అనంతపురం వెళ్లే మార్గంలో మారెంపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ప్రైవేటు అంబులెన్స్ బోల్తా పడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణానికి చెందిన రేణుకప్ప తన కూతురికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో మంగళవారం అనంతపురం తీసుకెళ్లి చికిత్సలు చేయించుకుని తిరిగి రాయదుర్గం బయల్దేరాడు. గుమ్మఘట్ట మండలం మారెంపల్లి గ్రామం వద్ద అంబులెన్స్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న స్తంభాన్ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. అందులో ఉన్న భార్య లక్ష్మి, కూతురు దీపికలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ప్లాస్టిక్ బాటిల్ తయారీ కేంద్రం సీజ్

రాయదుర్గం, మార్చి 19: తాగునీటికి వినియోగించే ప్లాస్టిక్ బాటిళ్ల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. అనుమతులు లేకుండా షెడ్డులో ప్లాస్టిక్ బాటిళ్ల తయారు చేస్తున్నారని సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్‌బాబు వెంటనే సిబ్బందిని పంపి తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉండగా అనుమతులు లేకుండా బాటిళ్ల తయారీ చేయడం గుర్తించామని దీనిపై క్రిమినల్ కేసుల నమోదుకు సిఫార్సు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

జూదరులు అరెస్టు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 19: మున్సిపాల్టీ పరిధిలోని ముదిగల్లు గ్రామ సమీపం, శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామ సమీపంలో దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రెండు చోట్ల మెరుపుదాడులు నిర్వహించి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 72200, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ ఫొటోలకు స్టిక్కర్ వేయండి ప్లీజ్ !



ఊబిచెర్ల సచివాలయం గోడకు ఉన్న సీఎం, ఎమ్మెల్యే ఫొటోలు

గుత్తిరూరల్, మార్చి19: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో అధికారులు ఎన్నికల నిబంధనలను బేఖాతార్ చేశారు. గ్రామంలో గత నాలుగు రోజుల కిందట నూతన సచివాలయాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి ఫొటోలతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ వచ్చి మూడు రోజులు అవుతున్నా వాటికి స్టికర్లు కుడా వెయ్యకుండా అలాగే ఉంచారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెద్దపప్పూరు, మార్చి19: మండలంలోని గార్లదిన్నె, బొందలదిన్నె, ముచ్చుకోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం తాడిపత్రి డీఎస్పీ గంగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు జాబ్‌మేళా

యాడికి, మార్చి19: స్థానిక ఆర్డీటీ పాఠశాలలో ఈనెల 21న మహిళలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ సీఓలు అంజనేయులు, నాగప్ప తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 28సంవత్సరాలలోపు యువతులు అర్హులన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి

బెళుగుప్ప, మార్చి 19: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహా పేర్కొన్నారు. మండలంలోని అంకంపల్లిలో మంగళవారం టీడీపీ మేనిఫెస్టోపై ఆయన ప్రచారం చేశారు. గ్రామ యువకులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. విజయసింహా నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు కరపత్రాలు పంపిణీ చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో స్థానిక టీడీపీ నాయకులు పురుషోత్తమ నాయుడి, శీనా, శంకరప్ప, రమేష్, భాస్కర్, సుధాకర్, కిష్టయ్య, ఎర్రిస్వామి, నరేంద్ర, గోపాల్, సురేష్, యర్రిస్వామి, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

కూడేరు: గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తనయుడు విక్రమ సింహ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన పథకాల గూర్చి వివరించారు. యువకులు, మహిళలు, వృద్ధులు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలిపారు.



ఉదిరిపికొండలో ప్రచారం చేస్తున్న విక్రమ సింహ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పవన్‌కుమార్(ఫైల్)

కూడేరు, మార్చి 19: మండలంలోని ఉదిరిపికొండ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డే పవన్‌కుమార్ (26) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు జల్లిపల్లి గ్రామానికి చెందిన వడ్డే పవన్‌కుమార్ ఉరవకొండ పట్టణంలో జరుగుతున్న ఉత్సవాలకు ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. బళ్లారి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు ఉదిరిపికొండ గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వడ్డే పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది: ఆర్డీవో



అవగాహన ర్యాలీ చేస్తున్న ఆర్డీవో రాణి సుష్మిత

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 19: ప్రజాస్వామ్య దేశంలో ఓటు అత్యంత విలువైనదని కళ్యాణదుర్గం ఆర్డీవో రాణి సుష్మిత పేర్కొన్నారు. ఓటు విలువను తెలియజేయడం కోసం మంగళవారం ఆర్డీఓ కార్యాలయం నుంచి టీ సర్కిల్ మీదుగా వాల్మీకి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ఆర్డీటీ ఆస్పత్రి వరకు రెవెన్యూ సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత ర్యాలీని ఆర్డీఓ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, నియోజకవర్గంలోని అన్ని మండల తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీ: జేసీ అశ్మిత్‌రెడ్డి



మెయిన్‌బజారులో పర్యటిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి19: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ అని నియోజక వర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఓంశాంతినగర్, మనియార్‌వీధి, పెద్దమ్మగుడివీధి ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ డ్రామా !

పెద్దవడుగూరు, మార్చి19: మండలకేంద్రానికి చెందిన బాలుడు మహేష్ కిడ్నాప్ డ్రామాతో తల్లిదండ్రులు, పోలీసులకు కంగారు పుట్టించాడు. పోలీసులు తెలిపిన మేరకు మండలకేంద్రానికి చెందిన ఓబులరాజు, మాధవి దంపతుల కుమారుడు మహేష్ మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పెన్సిల్ తెచ్చుకుంటానని ఉపాధ్యాయులకు చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. వారు పోలీసులను ఆశ్రయించారు. సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ ఫుటేజీలో బాలుడు మహేష్ 9.18గంటలకు పోలీస్‌స్టేషన్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్లి తిరిగి 10.30గంటలకు ఇంటికి చేరుకున్నాడు. పాఠశాలకు వెళ్లలేదని తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో ఇద్దరు వ్యక్తులు వచ్చి తనను బైక్‌పై ఎత్తుకెళ్లి మిడుతూరు గ్రామ సమీపంలోకి తీసుకువెళ్లారని, వాంతులు కావడంతో వదిలిపెట్టారని, అటుగా వెళ్తున్న ద్విచక్రవాహన దారులను అడిగి ఇంటికి వచ్చానని బాలుడు పోలీసులు, తల్లిదండ్రులకు చెప్పాడు. అనుమానం వచ్చిన పోలీసులు బాలున్ని గట్టిగా అడగడంతో తానే నాటకం ఆడానని తెలిపాడు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకుని, బాలుడిని హెచ్చరించి వదిలిపెట్టారు.